నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్






## గుర్తుకొస్తున్నాయి..!

### ట్యాంక్‌బండ్‌పై సన్‌డే ఫన్‌డే.. జ్ఞాపకాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): సాయం కాలం... సంధ్యా సమయం.. నగరం నడిబొడ్డున్న హుస్సేన్ సాగర్ తీరం.. అందాలతో కనువిందు చేస్తుంది. అలాంటి సాగర తీరంలోని ట్యాంక్‌బండ్‌పై గత కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సన్‌డే ఫన్‌డే జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయంటూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా పోస్టు చేస్తున్నారు. సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేసే వారికి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. ముఖ్యంగా సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాంక్ బండ్ మీదుగా ట్రాఫిక్ లేకుండా పోలీసులు చర్యలు తీసుకునే వారు. దీంతో నగర వాసులంతా సన్‌డే ఫన్‌డే అంటూ సాయంత్రం నుంచి రాత్రి ఎంతో సరదాగా గడిపేవారని, అలాంటి రోజులు మళ్లీ రావాలని కోరుకుంటున్నామని పలువురు పేర్కొన్నారు.



## కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

### 'ఎల్బీనగర్' సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

వనస్థలిపురం, ఫిబ్రవరి 4: అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి పచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్..పథకాలను అమలు చేయకుండా మోసం చేస్తున్నదని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం హస్తినాపురంలో జరిగిన ఎల్బీనగర్ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గల్లీలో, ఢిల్లీలో ఎవరూ అధికారంలో ఉన్నా.. తెలంగాణ కోసం పోరాడేది బీఆర్ఎస్ పార్టీనే అని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ సత్తా చాటుదామన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకునే బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలపైనే ఉందన్నారు. ఎక్కడ కార్యకర్తకు అన్యాయం జరిగినా, కేసులు పెట్టి వేధించినా అధైర్యపడొద్దని.. తాము అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

## మిసెస్ అండ్ మిస్ మెరుపులు

అందమైన భామలు ర్యాంప్ వాక్ చేస్తూ హొయలు పోయారు. ఆదివారం రాత్రి వీనస్ ఫిల్మ్ అండ్ ఈవెంట్స్, స్టార్ లైట్ ఈవెంట్ అండ్ ఎంటర్‌టైన్మెంట్ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని కత్రియా హోటల్‌లో మిస్, మిసెస్ సౌత్ ఇండియా ఫ్యాషన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మోడల్స్ ర్యాంప్ వాక్ చేసి ఆకట్టుకున్నారు.

- ఖైరతాబాద్, ఫిబ్రవరి 4



# కాంగ్రెస్‌ను మడతపెట్టి కొట్టుడే..

కేసీఆర్‌పై తిట్ల పురాణం బంద్ చేసి.. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- ఇచ్చిన హామీలు ఎగొట్టే ప్రయత్నం చేస్తున్న రేవంత్
- 'ఉప్పల్, మల్కాజిగిరి' విజయోత్సవ సమావేశాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మల్కాజిగిరి విజయోత్సవ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



ఉప్పల్ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మేడ్చల్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): 'ఇచ్చిన హామీలు ఎగొట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం రేవంత్.. మహాలక్ష్మి పథకం కోసం ఆడబిడ్డలు కండ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు.. కేసీఆర్‌పై తిట్ల పురాణం బంద్‌చేసి.. ముందు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకో' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల విజయోత్సవ సమావేశాల్లో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్ సిగ్గుమాలిన మాటలు మాట్లాడుతున్నారని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ మాట ఎందుకు అనలేదని కేటీఆర్ ప్రశ్నించారు. వంద రోజులు ఓపికగా ఉంటామని.. మార్చి 17 తర్వాత ఆరు గ్యారంటీలు అమలు కాకపోతే ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. గ్రేటర్‌లో ప్రజలు ఆలోచించి, అభివృద్ధి కోసం ఓటు వేశారు. జిల్లాలు, గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను నమ్మి మోసపోయారు' అని అన్నారు.

### కరెంటు బిల్లులు కట్టేదెవరూ..?

'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ప్రజలకు కరెంట్ బిల్లులు కట్టవద్దని అన్నారు. ఇప్పుడు.. కరెంట్ బిల్లులను రేవంత్ కడతారా.. లేక సోనియాగాంధీ కడతారా'.. అని కేటీఆర్ ప్రశ్నించారు. నగరంలో వేసవి ప్రారంభానికి ముందే కరెంట్ కష్టాలు మొదలైనట్లు చెప్పారు.

### గులాబీ జెండాను ఎగురవేయాలి

అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గాల్లో వచ్చిన మెజార్టీ చూస్తుంటే.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిలో బీఆర్ఎస్ గెలుపు ఖాయంగా కనిపిస్తుదన్నారు. కాంగ్రెస్‌ను మల్కాజిగిరిలో మడతపెట్టి కొట్టుడేనన్నారు. ఈ విజయోత్సవ సమావేశాల్లో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, రావుల శ్రీధర్‌రెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి పాల్గొన్నారు.

### బెదిరింపులు నడవవు..

బెదిరింపులు ఇక నడవవంటూ.. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరోక్షంగా హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులను బెదిరిస్తే.. ఊరుకునేది లేదన్నారు. ఇక బెదిరింపులు నడవవని బెదిరింపు ఫోన్లు వస్తే పోరాటం చేద్దామని, ఎవరూ ఆ ధైర్య పడవద్దని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో చేస్తానని గొప్పలు చెప్పుకున్న మాజీ ఎమ్మెల్యే.. ఓటమి పాలయ్యారని, మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించారని పేర్కొన్నారు.



ఉప్పల్ సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

# మెట్రో లింకులు కలిపేదెట్లా..?

- పీపీపీ విధానంలో మొదటి.. రెండో దశ చేపట్టేదెట్లా..?
- 5 చోట్ల మొదటి దశతో లింకులు..
- డీపీఆర్ రూపకల్పనలో అధికారులకు సంక్లిష్ట సవాళ్లు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): మెట్రో రెండోదశ పనులు క్షేత్ర స్థాయిలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రెండో దశకు సంబంధించిన 7 ప్రధాన కారిడార్లలో ట్రాఫిక్ సర్వేతో పాటు నిర్మాణానికి సంబంధించిన అంశాలపై మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రెండో దశకు సంబంధించిన డీపీఆర్‌ను 3 నెలల్లో సిద్ధం చేయాలని సూచించడంతో అదే పనిలో మెట్రో యంత్రాంగం నిమగ్నమైంది. అయితే రెండోదశలో ప్రతిపాదించిన కారిడార్లన్నీ ఇప్పటికే నిర్మించిన మొదటి దశ మెట్రోతో అనుసంధానం చేస్తూ ప్రాథమికంగా ప్రతిపాదనలు రూపొందించారు. ఇందుకు అనుగుణంగానే మొత్తం 7 కారిడార్లలో 70 కి.మీల దూరంతో రెండోదశ నిర్మాణం కోసం డీపీఆర్‌ను సిద్ధం చేసే పనిలో మెట్రో అధికారులు ఉన్నారు. అయితే ఇక్కడే మెట్రో అధికారులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. మొదటి దశ మెట్రో పూర్తిగా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించగా, రెండో దశను ఏ విధానంలో నిర్మించాలన్న దానిపై స్పష్టత లేదు. కేవలం డీపీఆర్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం మెట్రో సంస్థకు బాధ్యతలు అప్పగించినా, అసలు కథంతా రెండు దశలను కలిపి నిర్మించడం, ఆ తర్వాత వాటి నిర్వహణ మీదే సంక్లిష్టమైన పరిస్థితులు నెలకొన్నాయి. అసలే రద్దీగా ఉండే రోడ్లపై మెట్రో ప్రాజెక్టు నిర్మాణమే ఒక విధమైన సవాలు అయితే, అంతకు ముందు దాని డిజైన్ రూపకల్పన మరింత సంక్లిష్టంగా కనిపిస్తోంది.

### 7 మార్గాలు..70 కి.మీటర్లు..

ప్రస్తుతం వినియోగంలో ఉన్న మెట్రో మొదటి దశలో 5 చోట్ల లింకులు కలుపుతూ.. 7 మార్గాలను 70 కి.మీ మేర నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడే అసలు సవాలు ఎదురవుతున్నది. మొదటి దశను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ మెట్రోతో కలిసి పనిచేసేలా నిర్మాణం చేపట్టాలా? లేక అక్కడి నుంచి వేర్వేరుగా కారిడార్లను నిర్మించాలా? అన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రధానంగా మొదటి దశను పీపీపీ విధానంలో నిర్మించిన ఎల్ అండ్ టీ దాని నిర్వహణను సుమారు 30 ఏండ్ల పాటు నిర్వహిస్తుండగా, కొత్తగా నిర్మించే మార్గాలను దానికి అప్పగించడానికి ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా మెట్రో వయాడక్ట్ నిర్మాణాన్ని కలిపి నిర్మించాలా? లేక అక్కడికి సమీపం నుంచి నిర్మించాలా? అన్నది ఒకటైతే, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత మెట్రో రైళ్లను నిర్వహించే బాధ్యతలు ఎలా చేపట్టాలి? అందుకు ఎల్ అండ్ టీ వాడిన సిగ్నలింగ్ టెక్నాలజీని వినియోగించాలా? లేదా అంతకన్నా మెరుగైన టెక్నాలజీని వాడాలా అన్న అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా పలు అంశాలను మెట్రో అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రధానంగా కారిడార్-1(మియాపూర్-ఎల్బీనగర్) మార్గంలో ఒకవైపు ఎల్ బీ నగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్ నగర్ వరకు (8 కి.మీ), మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్ చెరు వరకు (14 కి.మీ) ప్రతిపాదించిన రూట్లను నిర్వహించాలంటే మొదటి దశ కీలకంగా ఉంటుంది.

### మెట్రో డిపోలు నిర్మించాల్సిందే..

మొదటి దశకు సంబంధం లేకుండా మెట్రో కారిడార్‌లను నిర్మించాలంటే మెట్రో డిపోలను ఎక్కువ చోట్ల నిర్మించాల్సి ఉంటుంది. ఇందు కోసం పెద్ద మొత్తంలో భూములు అవసరం, నిర్మాణం కోసం అధికంగా వ్యయమవుతుంది. దీనికి బదులుగా కారిడార్-1కు ఇరువైపులా కొత్తగా ఒకవైపు 8, మరో వైపు 14 కి.మీ అనుసంధానం చేస్తే ఎల్ అండ్ టీ మెట్రోనే దాని నిర్వహణకు అంగీకరిస్తే కొత్తగా మెట్రో డిపోలను నిర్మించాల్సిన అవసరం ఉండదు.

### కారిడార్-3లో..

ఇక మొదటి దశ మెట్రో కారిడార్-3 (నాగోల్-రాయదుర్గం)లో ఒకవైపు రాయదుర్గం నుంచి ఫైనాన్సియల్ డిస్టిక్ వరకు 8 కి.మీ, మరోవైపు నాగోల్ నుంచి ఎల్బీనగర్, అక్కడి కారిడార్-1కు అనుసంధానం చేయాలా? వద్దా? అన్న అంశాలను పరిగణలోకి తీసుకొని డీపీఆర్‌ను రూపొందించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వం నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ప్రతిపాదించిన మెట్రో మార్గాన్ని ఎక్కడి నుంచి ప్రారంభించాలి. ప్రారంభ మెట్రో స్టేషన్ ఎలా ఉండాలి? అన్న విషయాలను కీలకంగా పరిశీలించాల్సి ఉన్నదని ఓ మెట్రో అధికారి తెలిపారు. అంతిమంగా ప్రయాణికులకు నాన్ సాప్ (ఒక చివర నుంచి మరో చివరకు) ప్రయాణం చేయాలంటే లింకుల్లేని కారిడార్‌లను అందుబాటులోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆర్థిక భారం తగ్గాలన్నా, భవిష్యత్తులో నిర్వహణ, మరమ్మతుల ఖర్చులు తక్కువగా ఉండాలన్నా మొదటి దశ మెట్రోను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ మెట్రోతో కలిసి ప్రాజెక్టులను నిర్వహించేందుకు వీలుగా డిజైన్ చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు.

### రెండో దశలో చేపట్టే మెట్రో కారిడార్లు(కొత్త రూట్ మ్యాప్)

- కారిడార్ 2: ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు (5.5 కిలోమీటర్లు)
- కారిడార్ 2: ఫలక్ నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు వరకు (1.5 కిలోమీటర్లు).
- కారిడార్ 4: నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్ బీ నగర్ మెట్రో స్టేషన్ వరకు, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు, మైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు (మొత్తం 29 కిలోమీటర్లు).
- కారిడార్ 4: మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు (4 కిలోమీటర్లు).
- కారిడార్ 5: రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి బయో డైవర్సిటీ జంక్షన్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) వరకు (8 కిలోమీటర్లు).
- కారిడార్ 6: మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్ చెరు వరకు (14 కి.మీ).
- కారిడార్ 7: ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్ నగర్ వరకు (8 కిలోమీటర్లు).

## పన్ను చెల్లించకపోతే వాహనాలు సీజ్

సిటీబ్యూరో: వాహన పన్ను చెల్లించకుండా తిరుగుతున్న రవాణా వాహనాలపై ఆర్టీఏ అధికారులు దృష్టి సారించారు. ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 220 వాహనాలు పన్ను చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. 15 లక్షల పన్ను వివిధ రకాల వాహనాల నుంచి వసూలైంది. పన్ను చెల్లించకుండా నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను అధికారులు సీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జేటీసీ రమేశ్ మాట్లాడుతూ.. నగరంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు. వాహనానికి సంబంధించి ఆర్టీఏ నిబంధనలన్నీ పాటించాల్సిన బాధ్యత వాహనదారులదేనని చెప్పారు.

## నృత్యాంజలి..

ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టాయి.



# బల్దియా.. మొద్దునిద్ర

- ఆదాయానికి గండిపడుతున్నా.. పట్టింపేది..?
- లక్ష్యసాధనలో అలసత్వం
- ఇప్పటికే ఆస్తిపన్ను వసూళ్లలో వెనుకంజ
- ట్రేడ్ లైసెన్స్‌లోనూ అదే తీరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు





సిటీబ్యూరో: బల్దియా ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ బక్కచిక్కుతున్నా.. అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముంచుకొస్తున్నా.. వచ్చే నెలలో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తిపన్ను నిర్దేశిత లక్ష్యం రూ.2100కోట్లలో ఇప్పటి వరకు రూ.1333 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. అలాగే ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, రెన్యువల్‌లోనూ అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి లక్ష ఆరు వేల మంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేస్తే..ఈ సారి మాత్రం కేవలం 34వేల మాత్రమే రెన్యువల్ కావడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. జోనల్ కమిషనర్లు, కమిషనర్ పర్యవేక్షణ లోపం కారణంగా ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా జనవరి నుంచి డిసెంబర్ వరకు ట్రేడ్ లైసెన్స్‌ల గడువు ఉంటుంది. జనవరిలో రెన్యువల్స్ ఉంటాయి. కొందరు వ్యాపారులు ముందే రెన్యువల్ చేసుకుంటారు. అయితే ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్‌లో జాప్యం చేస్తే లైసెన్స్ ఫీజుకు అదనంగా ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు మధ్యలో రెన్యువల్ చేస్తే 25 శాతం అపరాధ రుసుం, ఏప్రిల్ 1 తర్వాత లైసెన్స్‌లను పునరుద్ధరిస్తే రెన్యువల్ దరఖాస్తులపై అదనంగా 50 శాతం అపరాధ రుసుముగా వసూలు చేస్తారు. ట్రేడ్ లైసెన్స్ పొందకుండా వ్యాపారాలు నిర్వహిస్తే 100 శాతం పెనాల్టీ విధించడంతో పాటు నెలకు 10శాతం అదనపు జరిమానా విధిస్తారు.

### అదనపు అంతస్తులు ఉంటే..

ఆస్తిపన్ను వసూళ్లలో అక్రమాలను పరిశీలిస్తే... ఆస్తి పన్ను ఏరియా తక్కువ చూపించడం.. కమర్షియల్ నుంచి రెసిడెన్షియల్ చూపించడం, వేయాల్సిన ట్యాక్స్ ఒక్కసారి వేసి భయభ్రాంతులకు గురిచేసి ఆ తర్వాత సంబంధిత భవన యజమానితో ఒప్పందాలు కుదుర్చుకోవడం... అదనపు అంతస్తులు ఉంటే చూసీచూడనట్లు ఉండడం...నిర్మాణంలో ఒక్క దుకాణం ఉన్న.. రెసిడెన్షియల్‌గానే చూపించడం వంటివి అక్రమాలు జరుగుతున్నాయన్నది అక్షరసత్యం. ట్రేడ్ లైసెన్స్ పాత ట్రేడ్ ఇండెక్స్ నంబరు..ఈజీగా ఇవ్వరు..ప్రొవిజన్ విధానంలో కొనసాగిస్తూ వ్యాపారస్తులతో కొందరు అధికారులు అందినంత దండుకుంటున్నారు. దీని ఫలితంగానే ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల నుంచి రావాల్సిన ఆదాయం సంస్థకు రావడం లేదు.

### ముందుకు సాగని ఆస్తిపన్ను వసూళ్లు

ఆస్తిపన్ను చెల్లింపుల్లో ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడం కష్టమేనని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కమిషనర్ ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆస్తిపన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో రావడం లేదు. గత నెల 31వ తేదీ మాత్రం ఒక్కరోజు రికార్డు స్థాయిలో రూ. 28కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఈ నేపథ్యంలోనే రూ.2100కోట్ల టార్గెట్‌లో ఇప్పటి వరకు రూ. 1333 కోట్లు మాత్రమే ఆస్తిపన్నును రాబట్టారు.

### ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణకు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణకు అవకాశం కల్పించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్ గడువును జనవరి 31వరకు తొలుత విధించామని, తాజాగా 25 శాతం పెనాల్టీతో మార్చి 31 వరకు రెన్యువల్ చేసుకునే అవకాశం ఉందని, ఏప్రిల్ 1 తర్వాత చేసుకోవాలంటే 50 శాతం మేర జరిమానా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే భారీ జరిమానాలు ఉంటాయని, నిర్ణీత గడువులోగా ధ్రువీకరణ పత్రాలను పునరుద్ధించుకోవాలన్నారు.

### ఆస్తిపన్ను టార్గెట్, వసూళ్లు

| జోన్ | నిర్దేశిత టార్గెట్ | వసూలైనవి (రూ.కోట్లలో) |
|---|---|---|
| ఎల్బీనగర్ | 320.94 | 189.02 |
| చార్మినార్ | 150.91 | 93.78 |
| ఖైరతాబాద్ | 546.07 | 333.29 |
| శేరిలింగంపల్లి | 447.28 | 308.61 |
| కూకట్‌పల్లి | 346.95 | 228.72 |
| సికింద్రాబాద్ | 287.85 | 181.02 |

### ప్రతి ఏటా ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ ఇలా..

| సంవత్సరం | ట్రేడర్స్ | కలెక్షన్ (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2021-22 (మార్చి- డిసెంబర్) | 34813 | 62.41 |
| 2022 (జనవరి-డిసెంబర్) | 74561 | 70.26 |
| 2023 (జనవరి -డిసెంబర్) | 106333 | 81.92 |
| 2024 (జనవరి 1 నుంచి 30వరకు) | 34298 | 51.20 |

### ప్రతి ఏటా కొత్తగా ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసినవి

| సంవత్సరం | న్యూ ట్రేడర్స్ | కలెక్షన్ (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2022 | 43888 | 26.73 |
| 2023 | 54744 | 27.89 |
| 2024 (జనవరి 1 నుంచి 30వరకు) | 4646 | 2.60 |